క్లుప్తంగా

విద్యాసామగ్రి అందజేత



ఆత్మకూరు(చేజర్ల) : మండల కేంద్రమైన చేజర్లలోని అరుంధతీయవాడ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు తొమ్మిదో వార్డు సభ్యురాలు సోమవరపు సంగీత విద్యా సామగ్రిని అందజేశారు. పాఠశాలలో గురువారం ఆమె ప్రతి విద్యార్థికి నోటు పుస్తకాలు, బలపాలు, పెన్సిళ్లు, జామెంట్రీ బాక్సులు తదితర విద్యా సామగ్రిని అందించారు. గత నాలుగేళ్లుగా ఏటా విద్యార్థులకు విద్యాసామగ్రి అందజేస్తున్నట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం రమణారెడ్డి, సోమవరపు హజరత్తయ్య, ఎ.భాగ్యమ్మ, కాకుమూరి జయరామయ్య, ఆంజనేయులు, రవికుమార్, సుబ్బరాయుడు, కృష్ణయ్య, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఎంలకు వర్క్‌షాప్



మాట్లాడుతున్న ఎంఈఓ జానకీరామ్

సంగం : మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో మండలంలోని 57 పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఎంఈఓ జానకీరామ్ గురువారం వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా బడి బయట పిల్లలను గుర్తించి పాఠశాలలకు పంపేలా తల్లిదండ్రులను ప్రోత్సహించే విధంగా అవగాహన కల్పించాలని సూచించారు. పాఠశాలల్లో వినూత్నమైన కార్యక్రమాలు చేపట్టి విద్యార్థులను ఆకర్షించాలని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్ పెంచడమే లక్ష్యంగా కృషి చేస్తున్నామని తెలియజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ-2 మల్లయ్య, జెడ్పీహైస్కూల్ ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీపై అవగాహన



మాట్లాడుతున్న ఎంపీడీఓ రంగసుబ్బరాయుడు

కలిగిరి : ఎన్‌టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీపై మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ రంగసుబ్బరాయుడు గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది ద్వారా 1వ తేదీనే లబ్ధిదారులకు పింఛన్లు అందించాలన్నారు. అనంతరం పలు సలహాలు, సూచనలు అందించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బందితో పింఛన్ల పంపిణీ

అల్లూరు : జూలై నెల పింఛన్లను సచివాలయ సిబ్బందితో పంపిణీ చేస్తున్నట్లు ఎంపీడీఓ జ్యోతి గురువారం తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి సచివాలయ సిబ్బందితో 50 పింఛన్లను పంపిణీ చేయిస్తామని, తగినంత సిబ్బంది లేకుంటే అంగన్‌వాడీ కార్యకర్తలు లేదా ఇతర సిబ్బందితో కార్యక్రమం చేపడుతామన్నారు.

అనంతసాగరంలో సెక్టార్ సమావేశం



సెక్టార్ సమావేశంలో యూనియన్ నాయకులు

సోమశిల : అనంతసాగరం మండల కేంద్రంలోని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ వద్ద మర్రిపాడు, డీసీపల్లి సెక్టార్ సమావేశం గురువారం జరిగింది. ఈ సందర్భంగా అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులను ఎన్నుకున్నారు. డీసీపల్లి సెక్టార్ నాయకురాలిగా అరుణ, పర్వీన్, మర్రిపాడు సెక్టార్ నాయకురాలిగా లక్ష్మి, ఆదిలక్ష్మి, పద్మలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీఐటీయూ అనంతసాగరం మండల కార్యదర్శి అన్వర్‌బాషా, డీసీపల్లి, మర్రిపాడు, సెక్టార్ల అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సమస్యను పరిష్కరించండి

- ఎంపీడీఓకు వినతి

సోమశిల : మండలంలోని పడమటికంభంపాడు గ్రామంలో తమ వీధిలో ఓ వ్యక్తి నిత్యం ట్రాక్టర్‌ను అడ్డుగా నిలిపి రాకపోకలకు ఇబ్బంది కలిగిస్తున్నాడని, దీనిపై ప్రశ్నిస్తే గొడవకు దిగుతున్నారని, ఈ సమస్యను పరిష్కరించాలంటూ ఎంపీటీసీ సభ్యురాలు నాగిపోగు రాధమ్మ గురువారం ఎంపీడీఓ తాజ్‌మున్సార్‌కు వినతిపత్రం సమర్పించారు. పంచాయతీ బజార్‌లో ప్రతి నిత్యం ట్రాక్టర్ అడ్డుగా పెట్టడం వల్ల ఆ మార్గంలో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారని ఆయన దృష్టికి తీసుకొచ్చారు.



పుట్ట వద్ద పూజలు చేస్తున్న భక్తులు



హోమగుండం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు

బ్రహ్మోత్సవ వైభవం.. భక్తజన పరవశం

దుత్తలూరు మండలంలోని నర్రవాడలో వెంగమాంబ పేరంటాలు బ్రహ్మోత్సవాలు గురువారంతో ముగిసింది. చివరిరోజు కావడంతో భక్తులు విశేషంగా తరలివచ్చి వెంగమాంబ దంపతులను దర్శించుకుని పరవశించిపోయారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. హోమగుండంలో కొబ్బరిచిప్పలు వేసి మొక్కులు తీర్చుకున్నారు. పుట్ట వద్ద పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు, భజనలు భక్తులను ఆకట్టుకున్నాయి.

– దుత్తలూరు



అంగళ్ల వద్ద రద్దీ



అమ్మవారికి చీర, సారె తీసుకెళ్తూ..



క్యూ లైన్‌లో బారులు తీరిన భక్తులు



చిన్నారుల కేరింతలు

నేటి నుంచి సీతారాముల ఉత్సవాలు

ఉదయగిరి : మండలంలోని సున్నంవారిచింతల గ్రామంలో ఉన్న కోదండరామస్వామి ఆలయంలో శుక్రవారం నుంచి మూడురోజుల పాటు సీతారాముల ఉత్సవాలు జరుగుతాయని నిర్వాహకులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం గణపతి పూజ, కలశస్థాపన, నవగ్రహ మండపారాధన, మూలవిరాట్, ఉత్సవ విగ్రహాలకు పంచామృతాభిషేకాలు, విశేష పూజలు, సాయంత్రం ప్రత్యేక పూజలు, అర్చనలు, రాత్రి గ్రామోత్సవం, శనివారం ఉదయం ప్రత్యేక పూజలు, రాత్రికి సీతారాముల కల్యాణ మహోత్సవం, గ్రామోత్సవం జరుగుతుందన్నారు. ఆదివారం వసంతోత్సవం, ఉట్టికొట్టడం, బండ్ల పొంగళ్ల కార్యక్రమాలు జరుగుతాయన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

సమస్యల పరిష్కారానికి వినతి



ఎమ్మెల్యే సురేష్‌కు వినతిపత్రం ఇస్తున్న జ్యోతి

సీతారామపురం : సీతారామపురం మండలంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు కలివెల జ్యోతి ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌ను గురువారం కలిసి వినతిపత్రం అందించారు. మండలంలో వలసల నివారణ చర్యలతో పాటు సీతారామ్‌సాగర్ ప్రాజెక్టు, మర్రివూట్ల వాగు, చెరువు, గుండుపల్లి చెరువుల మరమ్మతులు, ఎన్టీఆర్ సుజల స్రవంతి ప్రాజెక్టు పనులు పునఃప్రారంభం, మహిళలు, యువత కోసం స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రం, డిగ్రీ కళాశాల, పాలిటెక్నిక్ కళాశాలల సదుపాయం, అన్న క్యాంటీన్, నర్సరీ కల్పనతో పాటు సిద్ధేశ్వరాన్ని పర్యాటక ప్రాంతంగా గుర్తించాలని కోరారు.

బీసీజీ వ్యాక్సిన్‌తో టీబీకి చెక్



చేజర్ల మండలం నాగలవెల్లటూరులో బీసీజీ వ్యాక్సిన్ వేస్తున్న వైద్య సిబ్బంది



వరికుంటపాడు : ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సీహెచ్ఓ రాజశేఖరరాజు

ఆత్మకూరు(చేజర్ల) : క్షయవ్యాధి(టీబీ)ని నిర్మూలించేందుకు బీసీజీ వ్యాక్సినేషన్ చక్కగా పనిచేస్తుందని, వయోజనులు తప్పనిసరిగా బీసీజీ వ్యాక్సిన్ వేసుకోవాలని పీహెచ్‌సీ డాక్టర్ జ్యోతి అన్నారు. మండలంలోని నాగలవెల్లటూరులో బీసీజీ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు క్షయవ్యాధిని(టీబీ) నిర్మూలించేందుకు బీసీజీ వ్యాక్సిన్ వేస్తోందని, దీనిని పీహెచ్‌సీల ద్వారా ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం గ్రామంలో పలువురికి బీసీజీ వ్యాక్సిన్ వేశారు. ఎంఎల్‌హెచ్‌పీ సూపర్‌వైజర్ శ్రీనివాసులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

159 మందికి..

వరికుంటపాడు : మండలంలోని 12 గ్రామ సచివాలయాల పరిధిలో స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యసిబ్బంది గురువారం 159 మందికి ముందస్తుగా అడల్ట్ బీసీజీ వ్యాక్సిన్ను వేశారు. ఈ సందర్భంగా యర్రంరెడ్డిపల్లెలో జరుగుతున్న వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని వైద్యశాల సీహెచ్ఓ రాజశేఖరరాజు తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. బీసీజీ టీకాపై ప్రజలకు అవగాహన కల్పించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. బీసీజీ టీకాను వయోజనులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ వెంకటయ్య, ఏఎన్ఎం సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ గణనపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న డీటీ నాగలక్ష్మి

అల్లూరు : స్థానిక రెవెన్యూ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ నాగలక్ష్మి ఆధ్వర్యంలో వీఆర్వోలకు వ్యవసాయ గణనపై అవగాహన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యవసాయ గణనకు సంబంధించి వీఆర్వోలు క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రతి రైతు వివరాలను సేకరించాలన్నారు. రైతు భూమి, ఎంత విస్తీర్ణం, ఏ రకమైన పంట సాగు చేస్తున్నారు.. ఎంత విస్తీర్ణంలో సాగు చేస్తున్నారు.. తదితర వివరాలను సేకరించాలన్నారు. ఈ డేటాను ఆన్‌లైన్‌లో నమోదు చేసే కార్యక్రమం తరువాత చేపడుతామన్నారు. కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి మానసాదేవి బ్రహ్మోత్సవాలు



ప్రత్యేకాలంకరణలో అమ్మవారు

వరికుంటపాడు : మండలంలోని తూర్పురొంపిదొడ్ల గ్రామంలో కొలువైన మానసాదేవి అమ్మవారి పదో వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారం నుంచి ఆదివారం వరకు జరుగుతాయని నిర్వాహకులు గురువారం తెలిపారు. చల్లా వంశస్తుల ఆధ్వర్యంలో జరిగే ఉత్సవాల్లో తొలిరోజు శుక్రవారం ఉదయం విశేష పూజలు, అభిషేకాలు, సాయంత్రం శ్రీలక్ష్మీనారాయణ కల్యాణం జరుగుతుందన్నారు. శనివారం ఉదయం గణపతి పూజ, స్త్రీసూక్త, సర్వసూక్త సహిత మానసాదేవి చండీ హోమం, ప్రత్యేక పూజలు, గ్రామోత్సవం ఉంటుందన్నారు. ఆదివారం వాల్మీకి పూజ, సహస్రనామార్చనతో కుంకుమపూజ, బండ్ల పొంగళ్ల కార్యక్రమాలు జరుగుతాయన్నారు. భక్తుల రద్దీ దృష్ట్యా అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. ఈ ఉత్సవాలకు ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ముఖ్యఅతిథిగా హాజరవుతారని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

నూరు శాతం ఫలితాలే లక్ష్యం

- జెడ్పీహైస్కూల్‌ను సందర్శించిన డిప్యూటీ డీఈఓ



ఉపాధ్యాయులతో డిప్యూటీ డీఈఓ

సంగం : వచ్చే విద్యాసంవత్సరంలో పదో తరగతిలో నూరు శాతం ఫలితాల సాధనే లక్ష్యంగా కృషి చేయాలని డిప్యూటీ డీఈఓ గోపాల్ అన్నారు. సంగం మండలం మర్రిపాడు జెడ్పీహైస్కూల్‌ను డిప్యూటీ డీఈఓ గురువారం సందర్శించారు. తరగతి గదిలో ఉపాధ్యాయుల విద్యాబోధనను పరిశీలించారు. అనంతరం రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పదో తరగతిలో మంచి ఫలితాలు సాధించడానికి కృషి చేసిన ప్రధానోపాధ్యాయుడు నరసింహమూర్తితో పాటు ఉపాధ్యాయ బృందాన్ని అభినందించారు. వచ్చే విద్యాసంవత్సరంలో మంచి ఫలితాలు సాధించాలని సూచించారు.

కొత్త భవనంలోకి వాశిలి సచివాలయం

ఆత్మకూరురూరల్ : మండలంలోని వాశిలిలో అద్దె భవనంలో నిర్వహిస్తున్న గ్రామ సచివాలయాన్ని గురువారం నూతన భవనానికి మార్పు చేశారు. మారిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో అద్దె భవనంలో నిర్వహిస్తున్న వాశిలి సచివాలయం విషయమై ఇటీవల వివాదం నెలకొంది. ఈ నేపథ్యంలో ఎంపీడీఓ బాలాజీ నాయక్, వాశిలి సర్పంచ్ చెలిక రమా చొరవ తీసుకుని గ్రామంలో రేషన్ డీలర్ ఆధీనంలో ఉన్న ప్రభుత్వ కార్యాలయ భవనాన్ని స్వాధీనం చేసుకుని మరమ్మతులు చేయించి తరలించారు. ఇకపై ప్రజలకు అవసరమైన సచివాలయ సేవలు కొత్త భవనంలో అందుతాయని సర్పంచ్ తెలిపారు.

మహారాష్ట్ర వాసి అరెస్ట్

ఆత్మకూరు: మహారాష్ట్రకు చెందిన షేక్ జాహిద్ అనే యువకుడిని అక్కడి పోలీసులు స్థానిక పోలీసుల సహకారంతో అరెస్ట్ చేసిన ఘటన మండల కేంద్రమైన ఏఎస్‌పేటలో బుధవారం అర్ధరాత్రి జరిగింది. ఎస్సై ప్రసాద్‌రెడ్డి కథనం మేరకు.. షేక్ జాహిద్ మహారాష్ట్రకు చెందిన సానియా బేగ్ అనే బాలికకు మాయమాటలు చెప్పి ఏఎస్‌పేటకు నాలుగు నెలల క్రితం తీసుకొచ్చాడు. స్థానికులు అడగ్గా ఆమె మానసిక స్థితి బాగోలేకపోవడంతో దర్గాకు తీసుకొచ్చినట్లు చెప్పాడు. కాగా బాలిక తల్లిదండ్రులు కిడ్నాప్ కేసు పెట్టడంతో మహారాష్ట్ర పోలీసులు దర్యాప్తు చేశారు. సెల్‌ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా వారు ఏఎస్‌పేటలో ఉన్నట్లు గుర్తించారు. అతడిని, బాలికను మహారాష్ట్రకు తీసుకెళ్లినట్లు ప్రసాద్‌రెడ్డి వివరించారు.

ఉపాధి పనులపై సోషల్ ఆడిట్



గ్రామసభ నిర్వహిస్తున్న అధికారులు

సోమశిల : అనంతసాగరం మండలంలోని పాతాళపల్లి గ్రామంలో గతేడాది జరిగిన ఉపాధి హామీ పనులపై గురువారం గ్రామ సభ నిర్వహించారు. గ్రామంలో జరిగిన పనుల్లో ఎక్కడా అవకతవకలు జరగలేదని స్పష్టం చేశారు. ఎంఈఓ ప్రభాకర్‌రెడ్డి, ఏపీఓ దయాసాగర్, సర్పంచ్ బిజివేముల ఓబుల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

ఆత్మకూరు(చేజర్ల) : చేజర్ల మండలంలోని చిత్తలూరు గ్రామానికి చెందిన తాళ్ల శ్రీనివాసులు మండల కేంద్రమైన మనుబోలు వద్ద గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల వివరాల మేరకు.. సొంత పని నిమిత్తం మనుబోలుకు బైక్‌పై వెళ్లిన శ్రీనివాసులు తిరిగి స్వగ్రామానికి వస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొని రోడ్డుపై పడి తీవ్ర గాయాలపాలైనట్లు సమాచారం. 108 వాహనం ద్వారా చికిత్స నిమిత్తం నెల్లూరుకు తరలించారు. అతని పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది.

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు



సమీక్ష సమావేశం నిర్వహిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ బ్రిజిత

కావలి : లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించడం చట్ట విరుద్ధమని, స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులు లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ బ్రిజిత అన్నారు. కావలి ఏరియా ఆస్పత్రిలో లింగ నిర్ధారణ పరీక్షల నిషేధంపై గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ బ్రిజిత మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు లోబడి మాత్రమే స్కానింగ్ సెంటర్లు వ్యవహరించాల్సి ఉంటుందన్నారు. నిబంధనలకు విరుద్ధంగా లింగనిర్ధారణ పరీక్షలు నిర్వహించినా, అబార్షన్‌లకు సహకరించినా సంబంధిత స్కానింగ్ సెంటర్లపై కఠిన చర్యలు చేపట్టడంతో పాటు నిర్వాహకులపై కేసులు నమోదు చేయనున్నట్లు స్పష్టం చేశారు. అనంతరం పీసీపీఎన్‌డీటీ జిల్లా ప్రోగ్రామ్ అధికారులు శ్రీనివాసరావు, కనకరత్నంలతో కలిసి పట్టణంలోని స్కానింగ్ సెంటర్లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్కానింగ్ కేంద్రాల్లోని రికార్డులు, రిపోర్టులను పరిశీలించి పలు సూచనలు చేశారు.

తెల్లరాయి నిల్వలపై విజిలెన్స్ తనిఖీ



తనిఖీలు చేస్తున్న మైనింగ్, విజిలెన్స్ అధికారులు

ఆత్మకూరు(చేజర్ల) : చేజర్ల మండలంలోని కొల్లపు నాయుడుపల్లి గ్రామంలో తెల్లరాయి స్టాక్ పాయింట్ నిల్వలను జిల్లా మైనింగ్ ఏడీ బాలాజీ నాయక్ తన సిబ్బందితో కలిసి గురువారం తనిఖీలు చేశారు. గ్రామానికి చెందిన ఓ ప్రభుత్వ ఉద్యోగిగా విధులు నిర్వహిస్తున్న మహిళకు తెల్లరాయి తవ్వకాలు, రవాణాకు అనుమతులు పొందిన విషయాన్ని తెలుసుకున్న విజిలెన్స్ అధికారులు తనిఖీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. శ్రీపెనుశిల లక్ష్మీనరసింహస్వామి మినరల్స్ యజమాని వై.సుబ్బరత్నమ్మకు సంబంధించిన క్వారీలో 1200 టన్నులకుపైగా తెల్లరాయి నిల్వ ఉంచినట్లు తమ పరిశీలనలో తేలిందని ఏడీ బాలాజీ నాయక్ తెలిపారు. అనుమతి పత్రాలను, మిగిలిన రికార్డులను పరిశీలించి జిల్లా అధికారులకు నివేదిక అందజేయనున్నట్లు ఏడీ వివరించారు.

అంబులెన్స్ సిబ్బంది నూతన కమిటీ ఎన్నిక



సీపీఎం కార్యాలయంలో సమావేశమైన యూనియన్ నాయకులు

ఆత్మకూరు : ఆత్మకూరు మున్సిపల్ పరిధిలో ప్రైవేట్ అంబులెన్స్ డ్రైవర్లు, ఓనర్ల యూనియన్ అసోసియేషన్ నూతన కమిటీని ఎన్నుకుంది. పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో ప్రైవేట్ అంబులెన్స్ సిబ్బంది గురువారం సమావేశమయ్యారు. నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక కార్యక్రమాన్ని సీఐటీయూ జిల్లా నాయకులు జీవీ శివప్రసాద్, ఆత్మకూరు సీపీఎం నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించారు. యూనియన్ కార్యదర్శిగా సుల్తాన్‌బాషా, అధ్యక్షుడిగా పి.షరీఫ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకోగా కార్యదర్శిగా శివ, ట్రాన్స్‌పోర్ట్ యూనియన్ కార్యదర్శిగా సురేష్‌లను ఎన్నుకున్నట్లు సీఐటీయూ నాయకులు తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఎ.నాగయ్య, కొండమూరి హజరత్తయ్య, డేవిడ్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్కాలర్‌షిప్‌కు జలదంకి విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్ఎం, ఉపాధ్యాయులు

జలదంకి : 2023-24కు సంబంధించి జలదంకి ఉన్నత పాఠశాలకు చెందిన ఏడుగురు విద్యార్థులు ఎన్ఎంఎంఎస్(నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్)కు అర్హత సాధించినట్లు పాఠశాల హెచ్ఎం కొండారెడ్డి గురువారం తెలిపారు. వీరికి సంవత్సరానికి రూ.12 వేల చొప్పున నాలుగు సంవత్సరాల పాటు ఉపకార వేతనం అందుతుందని తెలియజేశారు. అర్హత సాధించిన జి.ధనుష్ మారుతి, టి.కావ్య, బి.అఖిల్, ఎం.వర్షితబాబు, వై.జాహ్నవి, వి.మున్విత్‌తేజ, టి.కార్తీక్‌లను జలదంకి పాఠశాలలో గురువారం అభినందించారు. పాఠశాల ఉపాధ్యాయులు రమేష్, మాల్యాద్రి, ప్రభాకర్, కృష్ణారెడ్డిలకు కూడా అభినందనలు తెలియజేశారు.

డయేరియా నిర్మూలనపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ సునీలత

సంగం : డయేరియా నిర్మూలనపై అవగాహన కార్యక్రమాన్ని సంగంలోని తోగటపాళెం అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ సీడీపీఓ సునీలత నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలని, పరిశుభ్రతపై అశ్రద్ధగా ఉండొద్దని తెలియజేశారు. చేతుల పరిశుభ్రత గురించి వివరించారు. అనంతరం డయేరియా నిర్మూలనకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఇంటింటికీ వెళ్లి గర్భిణులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ పద్మావతి తదితరులు ఉన్నారు.